
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 9 జనవరి 2024



వైసీపీలో టికెట్లు దక్కని వారితోపాటు టికెట్లు దక్కించుకున్న వారిలోనూ అసంతృప్తి.. అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ సెంట్రల్ టికెట్ దక్కించుకున్న వెలంపల్లి శ్రీనివాసరావును ఆ స్థానం నుంచి తప్పించవచ్చన్న ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై స్పష్టత ఉన్న వెలంపల్లి ఇప్పటికే ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో నిమగ్నమైనట్టు సమాచారం. మరోవైపు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టికెట్ దక్కించుకున్న షేక్ ఆసిఫ్ విషయంలోనూ చివరి నిమిషంలో మార్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

ఉంటాయా.. ఊడుతాయా?

వైసీపీలో సీట్ల లొల్లి



మచిలీపట్నం ఎంపీగా సారథిని నిలిపే యోచన

సుముఖత చూపని సారథి

- వెలంపల్లి, ఆసిఫ్ టికెట్లపై సందిగ్ధత
- పశ్చిమ నుంచే పోటీకి వెలంపల్లి మొగ్గు
- బీజేపీ పెద్దలను కలిసినట్టు ప్రచారం
- సీఎంవోకు క్యూకట్టిన రెండు జిల్లాల ఎమ్మెల్యేలు
- పేర్ని, కొడాలి, కైలే, సింహాద్రి, పార్థసారథి
- ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కూ సీఎంవో నుంచి పిలుపు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన ప్రస్తుత పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లికి సెంట్రల్ టికెట్ కూడా దక్కకపోవచ్చని సమాచారం. సెంట్రల్ నుంచి తనకు టికెట్ ఖరారు చేయడంపై వెలంపల్లి పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం అక్కడి నుంచి పోటీ చేస్తే తాను ఓడిపోవడం ఖాయమన్న విషయాన్ని తన సన్నిహితుల వద్ద మొర పెట్టుకుంటున్నారు. తనకు పట్టున్న పశ్చిమ నుంచి పోటీ చేస్తే గెలిచే అవకాశాలు సగమైనా ఉండేవని, సెంట్రల్ నుంచి గెలుపు అసాధ్యమని వెలంపల్లి తన సహచరులతో వ్యాఖ్యానించినట్టు చెబుతున్నారు. చాలా మందికి టికెట్లు గల్లంతవుతుండటంతో కనీసం తమ నాయకుడికి ఎక్కడో ఒకచోట టికెట్ ఇవ్వడంతో పరువు దక్కిందన్న భావనలో వెలంపల్లి శిబిరం ఉంది. సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే సొంత పార్టీ నాయకులే సహాయ నిరాకరణ చేస్తారన్న భయం వెలంపల్లిని వెంటాడుతోంది. మరోవైపు కాపు, బ్రాహ్మణ సామాజికవర్గాల ఆధిపత్యం ఎక్కువగా ఉన్న నియోజకవర్గంలో నెట్టుకురావడం కష్టమన్న భావనలో వెలంపల్లి శిబిరం ఉంది. వీటికితోడు ఇప్పటికే స్థానికేతరుడన్న ప్రచారం నియోజకవర్గంలో ఊపందుకుంది.

మొండితోకకు నో.. సారథికి బుజ్జగింపులు

ఎన్టీఆర్ జిల్లా నుంచి విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకి టికెట్ నిరాకరించిన వైసీపీ అధిష్ఠానం. రక్షణనిధికి సైతం టికెట్ ఇవ్వడం లేదని స్పష్టం చేసింది. తాజాగా నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావుకు సైతం టికెట్ ఇవ్వడం లేదని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇదే విషయాన్ని సోమవారం ఎమ్మెల్యే సోదరుడు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌ని పిలిచి తెలియజేసినట్టు సమాచారం. కృష్ణా జిల్లా నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు సోమవారం సీఎంవోకి తరలివెళ్లారు. పేర్ని నాని, కొడలి నాని, కైలే అనిల్‌కుమార్, కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేశ్ సీఎంవోకి వచ్చారు. పార్థసారథిని బుజ్జగించడంలో భాగంగా సీఎంవోకి పిలిపించనట్టు సమాచారం. సారథికి పెనమలూరు టికెట్ కాకుండా మచిలీపట్నం ఎంపీ స్థానం ఇవ్వాలన్న యోచనలో వైసీపీ పెద్దలు ఉన్నారు. అయితే ఎంపీగా పోటీకి సారథి విముఖత చూపుతున్నారు. మంత్రిగా తనకు అవకాశం ఇవ్వలేదన్న అసంతృప్తితోపాటు ఈసారి వైసీపీ అధికారంలోకి రావడం కష్టమేనన్న ఆలోచనలో ఉన్న సారథి టీడీపీ నుంచి బరిలోకి దిగాలని యోచిస్తున్నారు. పెనమలూరు నుంచి టీడీపీ టికెట్ ఆశిస్తున్న సారథికి టీడీపీ పెద్దలు నూజివీడు నుంచి బరిలోకి దిగాలని సూచిస్తున్నారు. ఈ పంచాయితీ తెగకముందే వైసీపీ పెద్దల నుంచి ఆయనకు పిలుపు వచ్చింది. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు అందరూ సహకరిస్తారని, మచిలీపట్నం ఎంపీగా పోటీ చేయాలని పార్టీ పెద్దలు సారథిని కోరినట్టు సమాచారం. ఈ ప్రతిపాదనకు సారథి నో చెప్పినట్టు సమాచారం.

చాపకింద నీరులా గౌతం ప్రయత్నాలు

ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతం రెడ్డి చాపకింద నీరులా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని పైకి చెబుతున్నా స్థానిక నాయకులకే టికెట్ దక్కించుకునే ప్రయత్నాలు చేయడం ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశంగా ఉంది. అందులో భాగంగా 30వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ జానారెడ్డి పేరును తెరపైకి తెస్తున్నారు. జానారెడ్డి సైతం సెంట్రల్ సీటు కోసం తన ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. మరోవైపు వెలంపల్లి సైతం పశ్చిమ నుంచే పోటీలో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. అవసరమైతే పార్టీ మారి అయినా పోటీలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. ఢిల్లీలో బీజేపీ పెద్దలను వెలంపల్లి కలిశారన్న ప్రచారం జరుగుతోంది.



అంగన్వాడీలకు సంఘీభావం తెలుపుతున్న బూరగడ్డ వేదవ్యాస్

• బెదిరింపులకు భయపడం

'ఎస్మా ప్రయోగించినా... పోలీసులను ఉసిగొల్పినా... ఉద్యోగం తొలగించినా... వెనుకడుగు వేయం. మాకు ఇచ్చిన హామీని అమలు చేసేదాకా పోరాటం కొనసాగిస్తాం' అంటూ అంగన్వాడీలు నినదించారు. 28వ రోజు సమ్మెలో భాగంగా బందర్‌లోని ధర్నాచౌక్ వద్ద అంగన్వాడీలకు ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతుగా నిలుస్తున్నాయి.

బందరులో తెలుగు యువత ర్యాలీ, ధర్నా



- 6లో..

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ రాజాబాబు

- 6లో..

బెజవాడలో సీఈసీ

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్‌కు స్వాగతం పలికిన అధికారులు




విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న భారత ఎన్నికల సంఘం చీఫ్ రాజీవ్ కుమార్

గన్నవరం, జనవరి 8 : భారత ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా స్వాగతం పలికారు. సోమవారం రాత్రి ఢిల్లీ నుంచి బయలుదేరి ఎయిర్ ఇండియా విమానంలో రాజీవ్ కుమార్‌తోపాటు ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ గన్నవరం విమానాశ్రయానికి చేరారు. వారికి ముఖేష్ కుమార్ మీనాతో కలిసి కృష్ణ జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ పి.జాషువా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వాగతం పలికారు. నగరంలోని నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో పార్లమెంట్, అసెంబ్లీ - 2024 ఎన్నికల సన్నద్ధతపై నిర్వహించే సదస్సులో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్, ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ పాల్గొననున్నారు. విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన నగరంలోని నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. నోవాటెల్ హోటల్ వద్ద ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో ఎస్‌వి.నాగేశ్వరరావు స్వాగతం పలికారు.

నష్టం తగ్గింపు

మిచౌంగ్ తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం తగ్గింపు కోసం అధికారులు సర్వశక్తులూ ఒడ్డారు. ఒక రైతుకు ఐదెకరాలకు మించి నష్టపరిహారం చెల్లించడం సాధ్యం కాదని మెలిక పెట్టి పరిహారాన్ని కుదించారు. గతంలో రూపొందించిన జాబితాల్లో జిల్లాలో *85,059* హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టుగా ప్రాథమిక అంచనాలు రూపొందిస్తే.. తుది జాబితాల్లో *58,835* హెక్టార్లకు పంటనష్ట పరిహారం ఇవ్వవచ్చని నిర్ధారించారు. ఈ నివేదిక కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపారు. కలెక్టర్ నుంచి ప్రభుత్వానికి పంటనష్టం జాబితాల నివేదిక పంపితే ఎప్పటికి పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ అవుతుందో వేచి చూడాలి.

తుఫాను పంట నష్టపరిహారం కుదింపు



దెబ్బతిన్న వరి పంట

- ప్రాథమిక అంచనాలో 85,059 హెక్టార్లలో నష్టం
- తుది జాబితాలో 58,835 హెక్టార్లకు కోత
- ఒక రైతుకు గరిష్ట నష్టపరిహారం ఐదెకరాలకే..
- పరిహారం రూ.141 కోట్ల నుంచి రూ.99 కోట్లకు తగ్గింపు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మిచౌంగ్ తుపాను కారణంగా గతేడాది డిసెంబరు 4, 5 తేదీల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా 33 శాతంకన్నా అధికంగా దెబ్బతిన్న వరి, ఇతర పంటలకు జరిగిన నష్టం వివరాలను వ్యవసాయ, రెవెన్యూశాఖల బృందాలు తయారుచేశాయి. ఈ జాబితాలను ఆధారంగా చేసుకుని రైతుల పేరుతో గ్రామంలోని పలుచోట్ల, మండలంలో, ఇతర మండలాల్లో, ఇతర జిల్లాల్లో ఉన్న భూమి వివరాలను ఈ-క్రాప్, ఆధార్‌కార్డు నెంబర్ల ఆధారంగా సేకరించారు. ఒక రైత ఎంతభూమి సాగుచేసినా ఐదు ఎకరాలకు మాత్రమే పంట నష్టపరిహారం పరిమితం చేస్తూ జాబితాలను సరిదిద్దారు. తొలిగా తయారు చేసిన పంట నష్టపరిహారం జాబితాలో జిల్లాలో 83,462 హెక్టార్లలో వరిపంట దెబ్బతిన్నట్టుగా చూపగా పంట నష్టపరిహారం 57,777 హెక్టార్లకు తగ్గించారు. వేరుశెనగపంట గతంలో 885 హెక్టార్లలో దెబ్బతిన్నట్టుగా చూపగా ప్రస్తుతం 681 హెక్టార్లకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. మొక్క జొన్న పంట గతంలో 220 హెక్టార్లలో దెబ్బతిన్నట్టుగా చూపగా 167 హెక్టార్లకు మాత్రమే పరిహారం వస్తుందని చెబుతున్నారు. మినుము 315 హెక్టార్లలో దెబ్బతిన్నట్టుగా గతంలో చూపి ప్రస్తుతం 58 హెక్టార్లకు పరిమితం చేశారు. పత్తి 177 హెక్టార్లలో దెబ్బతిన్నట్టు చూపి 151 హెక్టార్లకు పరిహారం ఇవ్వాలని తేల్చారు. అన్ని పంటలకు కలిపి గతంలో రూపొందించిన జాబితాలకన్నా 26,224 హెక్టార్లకు పంట నష్టపరిహారం రాదని లెక్కలు తేల్చారు. వరి, వేరుశెనగ, పత్తిపంటలకు హెక్టారుకు పంట నష్టపరి హారంగా రూ.17వేలు, మొక్కజొన్నకు రూ.12వేలు, మిను ముకు రూ.10వేలు చొప్పున పంట నష్టపరిహారంగా ఇవ్వాలి.

రూ.141.56 కోట్ల నుంచి రూ.99 కోట్లకు తగ్గింపు

వరి, పత్తి, మొక్కజొన్న తదితర అన్ని పంటలకు కలిపి జిల్లాలో రూ.141.56 కోట్లను పంటనష్ట పరిహారంగా ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులు గతంలో ప్రాథమిక నివేదికలో చూపారు. అన్ని లెక్కలు సరిచూసిన తరువాత ఈ నగదు మొత్తాన్ని రూ.99 కోట్లకు కుదించారు వాస్తవంగా రైతులు ఈ ఏడాది సాగుచేసిన పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. ఐదు ఎకరాలకే పంటనష్ట పరిహారాన్ని పరిమితం చేయడంతో రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందనిస్థితి నెలకొంది. రైతులు పంటలు కోల్పోయిన తీరును కేంద్ర బృందం సభ్యులు, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు, జిల్లా కలెక్టర్, జేసీ తదితరులంతా కళ్లారా చూశారు. మోపిదేవి, పామర్రు తదితర మండలాల్లో నీటిలో మునిగి కంకులు మొలకెత్తడంతో కొందరు రైతులు పంటను కోయకుండానే దమ్ముచేసేశారు. గతనెలలో వరికోతకు ఎకరానికి రూ.8వేల నుంచి రూ.9వేలు కోత కూలీగా ఇచ్చిమరీ వరికోతలు కోయించారు. కోతదశలో రైతులు పంటను కోల్పోతే కళ్లారా చూసిన అధికార యంత్రాంగం పంట నష్టపరిహారం ఇచ్చే సమయానికి నిబంధనలు అమలు పేరుతో కోత పెట్టడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఐదు ఎకరాలకు మించి పంటనష్టపరిహారం ఉండదనే నిబంధనను సవరించాలని రైతులు కోరుతున్నారు.

పందెంకోళ్లు రెడీ

పుంజు ధర రూ.50వేల నుంచి రూ.లక్షల్లో

- పుంజుల పెంపకానికి ప్రత్యేక ఏర్పాట్లు



హనుమాన్‌జంక్షన్ రూరల్, జనవరి 8 : తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పండుగైన సంక్రాంతి సందర్భంగా మూడురోజుల పాటు మూడు జిల్లాల్లో నిర్వహించే కోడిపందేలకు పుంజులను వివిధ ప్రాంతాల్లో సిద్ధం చేస్తున్నారు. పందేనికి ఎంపిక చేసుకున్న పుంజును బట్టి సుమారు రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో డిమాండ్ ఉంటుంది. ఎంపిక చేసుకున్న పుంజులను ప్రత్యేక ఏర్పాట్లతో రూ.వేలల్లో ఖర్చుపెట్టి మరీ తయారు చేయిస్తున్నారు. పందెం కోడికి పెట్టే పౌష్టికాహారం ఖర్చే రూ.30 వేలకుపైగా ఉంటుందంటే పందెం రాయుళ్లు ఎంత భారీగా ఖర్చు చేస్తున్నారో అర్థమవుతోంది. కృష్ణా, గోదావరి జిల్లాలోని బాపులపాడు, నూజివీడు రూరల్, పెదపాడు, పెనమలూరు తదితర మండలాల్లో కొందరు పందెంరాయుళ్లు నిర్వహిస్తున్న కేంద్రాల్లోకి ఇతరులెవరూ రాకుండా సీసీ కెమెరాలో నిఘా ఏర్పాట్లు చేశారంటే ఎంత జాగ్రత్తగా కోడిపుంజులను పందేలకి సిద్ధం చేస్తున్నారో తెలుస్తోంది. సంక్రాంతికి మాత్రమే పందెంకోళ్ల వ్యాపారం రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకూ జరుగుతుందని కేంద్ర నిర్వాహకుడు ఒకరు తెలిపారు. ఎంపిక చేసుకున్న పుంజులను ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యులు పర్యవేక్షిస్తారని, పందెం గెలిచేందుకు ప్రత్యేక వ్యాయామం, పౌష్టికాహారం అందిస్తూ సంక్రాంతికి బరిలో దించుతామన్నారు.

కొవ్వు పట్టకుండా ప్రత్యేక వ్యాయామాలు



- పందేనికి సిద్ధం చేసే కోడి శరీరాకృతిని బట్టి ఉడకబెట్టిన మటన్, బాదం, వెల్లులి, ఖర్జూరాలతో పాటు కోడిగుడ్డును ఆహారంగా ఇస్తామని తెలిపారు. పౌష్టికాహారం వల్ల కోళ్లకు కొవ్వు పెరగకుండా ప్రత్యేక వ్యాయామాలు చేయిస్తూ బరిలో ఉన్న కోడిపై ఎగిరి విరుచుపడేందుకు (నీటి తొట్లో ఈత, ఎత్తుపై నుంచి వదిలివేయడం) రోజూ ఉదయం, సాయంత్రం సాధన చేయిస్తూ పందానికి సిద్ధం చేస్తుంటామని నిర్వాహకులు తెలిపారు. శరీరం గట్టి పడేందుకు వేప, కుంకుడు, వెదురు, తుమ్మబెరడు, పసుపు కొమ్ములు తదితర 20 రకాల వాటితో కాసి మరిగించిన ద్రావణంలో చల్లార్చిన తర్వాత పందెం కోడిని ఉంచి పై నుంచి నీళ్ల పోతలు పోస్తామన్నారు. తరువాత లిక్కర్ (మందు) ఆవిరి పట్టిన గుడ్డతో కోడి శరీరం తుడవడంతో బరిలో దిగిన తర్వాత దెబ్బలు తట్టుకునే విధంగా కోడి శరీరం తయారవుతుంది. అందుకే పందెం గెలిచినా, ఓడినా కోడిపుంజు ధర వేలల్లో ఉంటుంది.
- కోడిపందేలపై సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు ప్రవాసాంధ్రులకు కూడా ఆసక్తి పెరగడంతో రానురాను కోడిపుంజుల పెంపకం కుటీర పరిశ్రమగా మారి వృద్ధి చెందుతోంది. ఆసక్తి పెరిగిన కొద్దీ కోడిపందేలకు పుంజులను సిద్ధం చేయడంలో వినూత్న ప్రక్రియలు చోటుచేసుకోవడం వాటి లాభాలు కనబడటంతో కొందరు కోడి పుంజుల పెంపకానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ద్వారా కూడా కోడిపుంజు రెడీ

దేశ, విదేశాల్లో నివసించే వారికి సొంత ఊరిలో జరిగే కోడి పందేలపై ఆసక్తితో ఆన్‌లైన్‌లో పుంజులను కొనుగోలు చేసి పెంపకందారులకు అడ్వాన్స్‌లు కూడా కట్టేస్తున్నారు. పందెం కోళ్ల పెంపకం, బరిలో దిగేందుకు చేసే సన్నద్ధత తదితర వివరాలను వీడియో కాల్ ద్వారా చూస్తూ సూచనలు కూడా చేస్తుంటారని నిర్వాహకులు తెలిపారు.

అంగన్వాడీలపై ఎస్మా దుర్మార్గం

భగ్గుమన్న కార్మిక సంఘాలు

- తక్షణం ప్రభుత్వం రద్దు చేయాలి
- ఉద్యోగులు, కార్మికుల సమ్మెకు మద్దతు
- సమ్మె పరిష్కరించకుంటే బంద్‌కు సిద్ధం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



వన్‌టౌన్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు, సీఐటీయూ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గవర్నర్‌పేట/వన్‌టౌన్, జనవరి 8 : సమ్మె చేస్తున్న అంగన్వాడీ వర్కర్స్‌పై ఎస్మా ప్రయోగించడాన్ని అప్రజాస్వామిక చర్య అని, అలాంటి జీవోలు వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీ, మున్సిపల్ వర్కర్స్, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల జీతాలు పెంచాలని, ఎస్మా చట్టం రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని, సమ్మెను పరిష్కరించకపోతే రాష్ట్ర బంద్‌కు కూడా వెళతామని సమావేశంలో వక్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిని బట్టి రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని నేతలు స్పష్టం చేశారు. జై భారత్ (నేషనల్) పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించాలని కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చొరవ చూపకుండా సమ్మె చేస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ, అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెకు దిగితే వారిపై ఎస్మా ప్రయోగించి జనవరి 8లోగా విధుల్లో చేరాలని అంగన్వాడీలకు డెడ్‌లైన్ విధించి బెదిరించడం హేయమైన చర్య అన్నారు. సమస్యలపై సంబంధిత సంఘాలతో చర్చించి సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులు 15 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, అంగన్వాడీలు లక్షమందికి పైగా పిల్లలు, మహిళలు, గర్భిణీలకు సేవలందిస్తున్నారని, సేవలు పొందుతున్న వారు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారేనన్నారు. గతంలో ఇచ్చిన హామీని మాత్రమే అమలు చేయమని వారు అడుగుతున్నారని, కొత్తగా కోరిన డిమాండ్లు కాదని అన్నారు. కార్మికుల సమ్మెకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా ఉంటాయని స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు.

సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా బంద్

- సీపీఎం హెచ్చరిక

మునిసిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త బంద్ నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నేతలు మధు, చిగురుపాటి బాబూరావు, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సీఐటీయూ ఇచ్చిన పిలుపుమేరకు మునిసిపల్ కార్మికులు, సీఐటీయూ శ్రేణులు బందర్‌రోడ్డులోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు సీహెచ్ బాబూరావు, బోయ సత్తిబాబు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జ్యోతిబసుతో పాటు సుమారు 50 మందిని గవర్నరుపేట పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు మధు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు, నాయకులు ఈవీ నారాయణ, వెంకట్రావు, ఎస్.సుబ్బారెడ్డి, ఐద్వా మహిళా సంఘం పశ్చిమ నగర కార్యదర్శి గాదె ఆదిలక్ష్మి, తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ స్టేషన్ ఎదుట కార్మికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మీడియాతో మాట్లాడుతూ, కార్మికులను అరెస్టు దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం ఇచ్చి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల ప్రజలు వైసీపీ పాలన తీరుపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి కార్మిక సమస్యలను పరిష్కరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్త బంద్ అవసరం వస్తుందని హెచ్చరించారు.

ఎస్మా జగన్ పైశాచికానికి పరాకాష్ట

- తిరువూరు సభ సక్సెస్‌తో జగన్‌పై ప్రజా వ్యతిరేకత తేటతెల్లం
- రంగుల పిచ్చితో రాష్ట్రాన్ని నాశనం చేశారు
- కాంట్రాక్టర్లు బ్లాక్ లిస్టులో పెట్టిన ప్రభుత్వం ఇదే
- ప్రజల తలసరి అప్పు రూ.15లక్షలు దాటింది : నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, జనవరి 8 : లక్షకు పైగా అంగన్వాడీ మహిళలు 29 రోజులుగా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే పట్టించుకోకుండా ఎస్మా ప్రయోగించటం జగన్ పైశాచికానికి పరాకాష్ట అని మాజీ మంత్రి విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. తిరువూరు సభ విజయవంతంతో జగన్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, చంద్రబాబుపై ప్రజలకు ఉన్న విశ్వాసం తేటతెల్లమైందని స్పష్టం చేశారు. సోమవారం తన నివాసంలో విలేకర్ల సమావేశంలో నెట్టెం మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వాలు తప్పులు చేసే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టేవని, జగన్ హయాంలో రివర్స్ జరుగుతోందని కాంట్రాక్టర్లే ప్రభుత్వాన్ని బ్లాక్‌లిస్టులో పెట్టారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అమలు చేసిన వంద సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ రానున్న వంద రోజుల్లో ఇంటికి వెళ్లటం ఖాయమన్నారు. మద్యం, ఇసుక, విద్యుత్ చార్జీల రూపంలో ప్రజల డబ్బు లాగేసుకుని.. సగటున నాలుగున్నరేళ్లలో తలసరి రూ.15లక్షల అప్పులు చేశాడని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పథకాలకు జగన్ రంగులు వేసుకుని.. ప్రజాధనాన్ని రూ.3500 కోట్లు దుర్వినియోగం చేశాడని, సర్వే రాళ్ల నుంచి పాస్ బుక్‌ల వరకు తన చిత్రాలు వేసు కోవటం ఆయన పిచ్చికి పరాకాష్ట అని విమర్శించారు. చంద్రబాబును తప్పుడు కేసులో ఇరికిస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కుల మత ప్రాంతాలకు అతీతంగా రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారని, చంద్రబాబుకున్న విశ్వసనీయత అదని నెట్టెం అన్నారు. సమావేశంలో పార్టీ నేతలు ఎంఎస్ బేగ్, ఎస్.రామకృష్ణ, కన్నెబోయిన రామలక్ష్మి, ముల్లంగి రామకృష్ణారెడ్డి, గింజుపల్లి రమేష్, గట్టిడి దుర్గాప్రసాద్, కట్టా నరసింహారావు, మేకా వెంకటేశ్వర్లు, అన్వర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రా కదలిరా సభ విజయవంతంపై శావల దేవదత్ కృతజ్ఞతలు

తిరువూరు : పట్టణంలో తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 'రా కదలిరా' బహిరంగ సభ విజయవంతం చేసిన పార్టీశ్రేణులు, ప్రజలకు నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తే.. సైకో జగన్‌రెడ్డి మద్యం, గంజాయి మాఫీయాను దిగుమతి చేశాడని ఆరోపించారు. సైకో పాలనకు చరమగీతం పలికి సైకిల్ పాలన తెచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కౌన్సిలర్లు షేక్ అబ్దుల్ హుస్సేన్, నాళ్లా సురేంద్ర, బీసీసెల్ నాయకుడు పి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

వైసీపీ పని ముగిసినట్టే

- మాజీమంత్రి దేవినేని ఉమా



రెడ్డిగూడెం, జనవరి 8 : రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేలను మార్చినా వైసీపీ ఓటమి తలరాతను ఎవరూ మార్చలేరని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. రెడ్డిగూడెంలో ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, 'రా కదిలిరా' సభలకు వస్తున్న అశేష జనాన్ని చూసి ఓర్వలేక జగన్ రెడ్డి, మంత్రులు పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారన్నారు. జగన్ తన ఎమ్మెల్యేలను నమ్మడం లేదని, జనం జగన్‌ను నమ్మడం లేదన్నారు. మూడు ముక్కలాటతో అమరావతిని నాశనం చేశాడన్నారు. ఒక్క చాన్స్ అని ముద్దులు పెట్టి అధికారంలోకి వచ్చి గుద్దులు గుద్దుతున్నాడన్నారు. పట్టిసీమను పాడు పెట్టాడన్నారు. డీఎస్సీకి దిక్కులేదన్నారు. అన్న క్యాంటీన్ కట్, పండుగ కానుకలు కట్, పెళ్లి కానుక కట్, చంద్రన్న బీమా కట్, ఫీజు రీయింబర్స్‌మెంట్ కట్, రైతుల సబ్సిడీలు కట్ ఇలా 100కు పైగా సంక్షేమ పథకాలు రద్దు చేశాడన్నారు. ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని, ముక్త కంఠంతో ఏపీ హేట్స్ జగన్ అని అంటున్నారన్నారు. సమావేశంలో ముప్పిడి నాగేశ్వర రెడ్డి, రాయుడు వెంకటేశ్వరరావు, పోతురాజు బాలకృష్ణ, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, బెల్లంకొండ రాజ, ఇశ్రాయేలు, మల్లాది పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌కు పీడబ్ల్యూడీ తప్పనిసరి

- ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి
- విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల స్వీప్ కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు



విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 8 : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అతి ముఖ్యమైనదని, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు భారత ఎన్నికల సంఘం కల్పించిన హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. సోమవారం పింగళి వెంకయ్య సమావేశమందిరంలో భారత ఎన్నికల సంఘం-సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీడీ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటు నమోదు, పీడబ్ల్యూడీ (పర్సన్ విత్ డిజబిలిటీ) మార్కింగ్, హోం ఓటింగ్ తదితరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం 40 శాతం, అంతకంటే అధిక వైకల్యమున్న వారికి, 80 ఏళ్లు, ఆపై వయసున్న వయోవృద్ధులకు ఇంటి దగ్గర నుంచే ఓటు వేసే హోం ఓటింగ్ సౌకర్యాన్ని అందుబాటులో తెచ్చిందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటు హక్కు వినియోగించుకోవడం ముఖ్యమని, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్గాలతో పాటు బీఎల్‌వోల ద్వారా తమ ఓటు వివరాలు తెలుసుకోవాలన్నారు. ఒకవేళ ఓటు నమోదు కాకుంటే వెంటనే నమోదు చేయించుకోవాలన్నారు. 40 శాతం, అంతకంటే అధిక వైకల్యమున్నవారు 80 ఏళ్లు ఆపై వయసున్న వయోవృద్ధులు ఇంటిదగ్గరి నుంచే హోం ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకొనేందుకు తప్పనిసరిగా ఫారం 8 సహాయంతో పీడబ్ల్యూడీ మార్కింగ్ చేయించుకోవాలని సూచించారు. ఈ అంశంపై విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘాలు తమ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో హోం ఓటింగ్ విధానాన్ని పూర్తిస్థాయిలో పటిష్టంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నామని, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పోలింగ్, భద్రతా సిబ్బంది వున్న ప్రత్యేక బృందం హోం ఓటింగ్‌లో భాగస్వామ్యమవుతుందని, వీడియోగ్రఫీ కూడా చేయడం జరుగుతుందని వివరించారు. త్వరలో ఓటు, పోలింగ్ స్టేషన్ వివరాలు తెలియజేసేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు, జిల్లా యువజన సంక్షేమ అధికారి, స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాస్‌లతో పాటు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేమూరి బాబురావు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీంద్రబాబు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు బి.రమేష్, ఎస్‌కే చాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు చట్టరీత్యా నేరం

కృష్ణలంక : కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హెచ్చరించారు. సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలో కోడి పందేలు జరగకుండా చర్యలపై సోమవారం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కోడి పందేలు నిర్వహించడం-పాల్గొనడం చట్టరీత్యా నేరమని ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చట్ట ప్రకారం కోడిపందేలను నిషేధించడం జరిగిందన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడా కోడి పందేలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యాసాగర్, ఏడీ విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్ వద్ద మృతుడి బంధువుల ఆందోళన

కారుకు మోటార్ సైకిల్ అడ్డు తీయలేదని రాళ్లతో కొట్టి వ్యక్తి హత్య


- ఇద్దరిపై కేసు నమోదు
- పాయకాపురంలో దారుణం



పాయకాపురం, జనవరి 8 : నగర శివారు పాయకాపురంలో దారుణం చోటు చేసుకుంది. కేవలం కారుకు మోటార్ సైకిల్ అడ్డువచ్చిందని ఇద్దరు యువకులు మరో వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. రాళ్లతో తలపై కొట్టి అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి నెట్టివేశారు. ఈ ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తేలుకుట్ల మాలకొండయ్య (41) స్థానిక ఎల్‌బీఎస్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ముఠా కార్మికుడైన మాలకొండయ్య ఆదివారం రాత్రి స్నేహితులు వెంకటేశ్వరరావు, రామయ్యలతో కలిసి పైపుల రోడ్డు నుంచి ఎల్‌బీఎస్‌నగర్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. లక్ష్మీనగర్ ప్రాంతానికి రాగానే వీరి వాహనానికి ట్రావెల్ బస్సు అడ్డు వచ్చింది. బస్సు మలుపు తిరుగుతుండటంతో మోటార్ సైకిల్‌ను ఆపారు. అంతలో వెనుక నుంచి వచ్చిన కారులో వచ్చినవారు హారన్ మోగించడంతో వెళ్లేందుకు దారి లేదు కదా అని సమాధానం చెప్పారు. దాంతో కారులో ఉన్న వరుసకు తోడల్లుళ్లయిన కంచర్ల సాయి(28), ఆత్మకూరి రామరాజు(27)లు వారితో ఘర్షణకు దిగారు. ఇరువర్గాలు తోపులాటకు దిగటంతో ఆగ్రహంతో రెచ్చిపోయిన సాయి, రామరాజు మోటార్ సైకిల్‌పై ఉన్న మాలకొండయ్య, వెంకటేశ్వరరావులపై దాడికి దిగారు. దాడిలో వెంకటేశ్వరరావు పక్కకు పడిపోగా మాలకొండయ్య తలపై నాపరాయితో దాడిచేశారు. కాళ్లతో విచక్షణా రహితంగా తన్ని పక్కనే ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి తోసేసి కారులో వెళ్లిపోయారు. స్థానికులు, బాధితుల బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఇరువురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మాలకొండయ్య సోమవారం ఉదయం మృతి చెందాడు. దీంతో బంధువులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకుని నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్టు చేయడంతో వారు శాంతించారు. కంచర్ల సాయి, ఆత్మకూరిరామరాజులపై 302, 323 సెక్షన్లకింద పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిష్ఠానం ఆదేశిస్తే మైలవరం నుంచి పోటీ చేస్తా

- కొండపల్లి వార్డు కౌన్సిలర్ ముప్పసాని భూలక్ష్మి



ఇబ్రహీంపట్నం, జనవరి 8 : మైలవరం ఎమ్మెల్యే సీటు బీసీలకు ఇస్తే తనకు ఇవ్వాలని, అధిష్ఠానం ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని కొండపల్లి మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ ముప్పసాని భూలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలు స్థానికులను కోరుకుంటున్నారని, మాజీమంత్రి దేవినేని ఉమాకు తాను వ్యతిరేకం కాదన్నారు. స్థానికురాలిగా ఎమ్మెల్యే సీటు కోరుకోవడం తప్పు కాదన్నారు. టీడీపీ బీసీలకు పెద్ద పీట వేస్తుందన్నారు. సీటు కోరుతూ కేంద్ర కార్యాలయానికి తెలిపామన్నారు. ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తానన్నారు.



జనసేన, వైసీపీ జెండాలతో పార్టీశ్రేణుల నినాదాలు

విగ్రహావిష్కరణలోనూ జగన్ జపం!

- రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వసంత
- జనసేన నేతపట్ల దురుసుగా ప్రవర్తించిన వైసీపీ శ్రేణులు
- కార్యక్రమంపై ఆసక్తి చూపని కాపు సామాజిక వర్గం

మైలవరం, జనవరి 8 : పట్టణంలో రాధా, రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంగవీటి రంగా కాంస్య విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. పార్టీలకు అతీతంగా అని చెప్పినా అంతా వైసీపీ హవానే కొనసాగింది. దానిని జీర్ణించుకోలేని జనసేన నేతలు పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. పోటా పోటీగా రెండు పార్టీలు జెండాలను ప్రదర్శించారు. వేదికపై వైసీపీ నేతలు జగన్ జపం చేయడంతో జనసేన నేతలు విస్మయం వ్యక్తం చేశారు. జనసేన మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) వేదికపై మాట్లాడుతుండగా రంగాను ఎవరు చంపారో చెప్పాలని త్రీవస్థాయిలో వైసీపీ నేతలు వత్తిడి తేవడంతో పాటు దురుసుగా ప్రవర్తించారు. రంగా విగ్రహావిష్కరణకు రాధా రంగా మిత్ర మండలి దూరంగా ఉండటానికి కారణం అక్కడ వైసీపీ ఆధిపత్యమే అనే టాక్ వినపడుతోంది.

బీసీలు సంఘటితం కావాలి

- గుడివాడ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, జనవరి 8 : టీడీపీ హయాంలో బీసీల సంక్షేమానికి జరిగిన కృషిని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నేతలు దిశా నిర్దేశం చేశారు. గుడివాడలో సోమవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము మాట్లాడుతూ, పార్టీకి బీసీలు గుండెకాయ లాంటివారన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి టీడీపీ విజయానికి



కృషి చేయాలని కోరారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి మాట్లాడుతూ, బీసీ కార్పొరేషన్‌కి చెందిన రూ.75 వేల కోట్ల నిధులను జగన్ దారి మళ్లించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) మాట్లాడుతూ, చట్టసభల్లో, మంత్రివర్గంలో బీసీలకు స్థానం కల్పించిన పార్టీ తెలుగుదేశం అన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, బీసీలకు సబ్ ప్లాన్ కింద 43 వేల కోట్ల రూపాయలు తెలుగుదేశం పార్టీ ఖర్చు పెట్టిందన్నారు. బీసీలకు మంచి రోజులు రావాలంటే చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కృష్ణా జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు నెరుసు కాశీ, నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షులు అంగడాల శ్రీనివాసరావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు గోవు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల నిరసనదీక్షలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

భూ హక్కు చట్టం వస్తే పేదల ఆస్తులకు రెక్కలు

- న్యాయవాదుల దీక్షకు లక్ష్మీనారాయణ సంఘీభావం

విజయవాడ లీగల్ : ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం-2022 అమలులోకి వస్తే కనీస న్యాయశాస్త్ర అవగాహన లేని వారు ల్యాండ్ టైట్లింగ్ ఆఫీసర్లవుతారని, దీనివల్ల పేదల ఆస్తులకు రెక్కలొచ్చినట్టేనని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. భూ హక్కు చట్టంకు వ్యతిరేకంగా న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 19వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, రిజిస్టర్‌లో ఒకసారి భూ హక్కుదారుని పేరు నమోదైన తర్వాత ఈ భూములపై ఎవరూ కోర్టులకు వెళ్లే అవకాశం వుండదనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజల ఆస్తి హక్కును న్యాయవ్యవస్థ పరిధి నుంచి తొలగించి ప్రభుత్వ అధికారులకు అప్పగించి వారిని ల్యాండ్ టైట్లింగ్ ఆఫీసర్లుగా నియమిస్తే అవినీతిమయం అవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తన సంపూర్ణ మద్దతు న్యాయవాదులకు వుంటుందన్నారు. దీక్షలో న్యాయవాదులు ఆలూరి సుధాకర్, చిలువేరు మార్కండేయ, ఆవుల వెంకటరావు, ఎస్.రాంప్రసాద్, ఎం.ప్రేమలత, జి.జీవన ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

- కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26వ తేదీన మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భారత గణతంత్ర జిల్లాస్థాయి వేడుకలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్పందన సమావేశపు హాలులో సోమవారం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గణతంత్ర వేడుకలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. దేశభక్తిని చాటేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను చాటిచెప్పేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ఉత్తమ సేవాపురస్కారాల జాబితాను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికసిత్ సంకల్పయాత్ర విజయవంతం చేయాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 9 నుంచి 11వ తేదీవరకు జరగనున్న వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పి.రోజా, ఉయ్యూరు ఆర్డీవో డి.రాజుతో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కేంద్రమంత్రి గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులతో జిల్లా పంచాయతీ అధికారి సమన్వయం చేసుకుని కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఎస్‌వో పార్వతి, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డీఈవో తాహెరా సుల్తానా, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



జేసీ అపరాజిత సింగ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా

అపరాజిత సింగ్‌కు ఘనంగా వీడ్కోలు

మచిలీపట్నం టౌన్, జనవరి 8 : కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన అపరాజిత సింగ్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. జెడ్పీ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ పి.జాషువా, డీఆర్వో రోజా, ఆర్డీవో వాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అపరాజితసింగ్ చేసిన కృషిని అధికారులు ప్రస్తావించారు. జ్ఞాపికలు, శాలువాలతో ఆమెను సత్కరించారు.

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి : ఢిల్లీరావు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 8 : స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, డీఆర్వో ఎస్.వి.నాగేశ్వరరావులు అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. స్పందనలో 161 అర్జీలు నమోదుకాగా.. రెవెన్యూ 84, పోలీస్ శాఖకు 19 అర్జీలు వచ్చాయి. పంచాయితీరాజ్-7, పౌరసరఫరాలు-6, హౌసింగ్-5 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందన అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేస్థాయిలో పరిష్కారం వుండాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు

బందరులో తెలుగు యువత ర్యాలీ, ధర్నా

మచిలీపట్నం టౌన్, జనవరి 8 : నాలుగేళ్లుగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగ యువతకు సీఎం జగన్ మొండిచేయి చూపారని కృష్ణాజిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయం నుంచి తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దండమూడి చౌదరి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో జగన్ ప్రతీఏటా జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి ఐదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం తెలుగు యువత అధ్యక్షుడు సలీం, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి అహమ్మద్ బేగ్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో పెద్ది రోజాకు వినతిపత్రం సమర్పించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	85, 92, 102
చికెన్ విత్ స్కిన్	164
చికెన్ స్కిన్‌లెస్	174



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ఆరుగొలను విద్యార్థినుల ప్రతిభ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 8 : ఆసక్తితో చదివితే పోటీల్లో అత్యున్నతస్థానం సాధించవచ్చని హెచ్‌ఎం దుర్గాప్రసాద్ విద్యార్థులకు సూచించారు. ఆరుగొలను హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడంతో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు లిఖిత, షేబారాణి, వాహినిలు ప్రతిభ కనబరచి జనవరి 27, 28తేదీల్లో విజాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వివరించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ చలం ప్రసాద్, ఉపాధ్యాయులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

రా కదలిరాతో వైసీపీ గుండెల్లో రైళ్లు

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరులో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బోడె ప్రసాద్

పెనమలూరు, జనవరి 8 : టీడీపీ రా..కదలిరా సభలకు వస్తున్న ప్రజలను చూసి తాడేపల్లి ముఠా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. సోమవారం పెనమలూరు మహిళా మండలి కట్టపై జరిగిన బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు. గతంలో కంటే ఉత్సాహంగా, స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో ప్రజలు చంద్రబాబు సభలకు హాజరవడం వచ్చే ఎన్నికల్లో జరిగే ప్రభంజనానికి నిదర్శనంగా భావించాలన్నారు. మరో పక్క మద్యం, బిర్యానీ ప్యాకెట్లు ఇచ్చి, బస్సులు పెట్టి, పథకాలు పోతాయని బెదిరించి సైకో జగన్ సభలకు జనాన్ని తరలించినా జనం హాజరు అంతంత మాత్రమేనని ఎద్దేవా చేశారు. చంద్రబాబు సభలను చూసి పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎక్కడ చేజారిపోతారనే భయంతో తాడేపల్లి ప్యాలెస్‌కు వారిని పిలిపించుకొని బ్రతిమలాడుకుంటున్నారన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్పుల గురించి బిల్డప్ ఇవ్వడం పక్కన పెట్టి, జగనే స్వయంగా మారాలన్నారు. చంద్రబాబును రాష్ట్ర ముఖ్యమంత్రిగా తిరిగి ఎన్నుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. బోడె వెంట సీనియర్ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, సంగపు రంగారావు, చిగురుపాటి మల్లయ్య, తోటకూర ఉదయభాస్కర్, బొమ్మిడి అన్నపూర్ణ, షేక్ సైదులు, గూడవల్లి పూర్ణ, కిలారు ప్రసాద్, యాళ్ల చక్రవర్తి, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

తాడిగడపలో బోడె హేమ ఆధ్వర్యంలో..

తాడిగడప 24వ డివిజన్‌లో బోడె ప్రసాద్ సతీమణి హేమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, బోడె ప్రసాద్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆమె వెంట మేడసాని రత్నకుమారి, రేఖ, నాగమణి, కనకదుర్గ, ప్రమీల, తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, మన్నె రాజాబాబు, నాగుల్ మీరా, వెంకటేశ్వరరావు, పామర్తి సిద్ధయ్య, కిలారు రవివర్మ, దామోదర్, కందుల ప్రసాద్, సాంబశివరావు, వడుగు సాంబశివరావు, షకీలా, కడియాల కిషోర్, కొండ్రు కోటేశ్వరరావు, నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

యనమలకుదురులో..

సైకో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డగోలుగా పెరిగిన నిత్యావసరాల ధరలతో పేదవాడి నడ్డి విరిగిందని యనమలకుదురు టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం యనమలకుదురు 48, 55, 59, 64 బూత్‌లు, కొండవెనుక సాయి నగర్‌లలో జరిగిన బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో అనంతనేని ఆజాద్, మొక్క



యనమలకుదురులో..

పాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, తమ్ము అశోక్‌లు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. అన్నిరకాల నిత్యావసరాలు, విద్యుత్ బిల్లులు, ఇసుక, సిమెంట్, ఇనుముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుడు బతికే పరిస్థితి లేదని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును తిరిగి ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. వారివెంట వీరంకి కుటుంబరావు, పండల రజిని, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, తాడిశెట్టి వీరాస్వామి, బూక్యా రాజా, షేక్ షాహీ నా, బలగం నాగరాజు, కళ్యాణపు శ్రీనివాస్, వెలగపూడి శేఖర్, మాచిన శివ, బాణావత్ విజయ్, మల్లంపాటి విజయలక్ష్మి, దుర్గారావు, షబ్బీర్, ఇమాం, ఆరిఫ్, బలగం కొండ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

ఉయ్యూరు : వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఉయ్యూరు 17వ వార్డులో సోమవారం బాబూ ష్యూరిటీ- భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్క కుటుం బానికి కలిగే లబ్ధి తెలియజేసి, రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి బోడె ప్రసాద్‌ను ఎమ్మెల్యే, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ కూనపరెడ్డి వాసు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నజీర్, పట్టణ కార్యదర్శి చిరంజీవి, నియోజకవర్గ బీసీ సెల్ కో ఆర్గనైజర్ మీసాల అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు 17వ వార్డులో..



చండీయాగం చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు

కొనసాగిన యార్లగడ్డ చండీయాగం

గన్నవరం, జనవరి 8: గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో యార్లగడ్డ వెంకట్రావు జ్ఞానేశ్వరీ దంపతులు చేపట్టిన చండీయాగం రెండవ రోజైన సోమవారం కొనసాగింది. భక్తిశ్రద్ధలతో ఉదయం, సాయంత్రం చండీయాగం, సుందరాకాండ పారాయణం చేశారు. తొలుత పురోహితులు గణపతి పూజతో ప్రారంభించి సూర్య నమస్కారాలు చేయించారు. మంగళ వాయిద్యాల నడుమ చండీహోమం జరిపారు. హోమగుండంలో అగ్ని ప్రతిష్టను గావించి దుర్గ సప్తశతి మంత్రాలను జపిస్తూ చండీయాగం చేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో జీవించాలని, ఆపదలు తొలగిపోయి టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ యార్లగడ్డ వెంకట్రావు చండీహోమం చేస్తున్నట్లు తెలిపారు.

అమ్మవారి ఆశీస్సులు పొందండి

ఉంగుటూరు : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని, గన్నవరంలో టీడీపీ విజయం సాధించాలని గన్నవరం పార్టీ ఇన్‌ఛార్జి యార్లగడ్డ వెంకట్రావు నిర్వహిస్తున్న చండీయాగం, సుందరాకాండ పారాయణం పూజాకార్యక్రమాల్లో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పార్టీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనోక్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

పేదల కాలనీ లబ్ధిదారులను
మోసం చేసిన బిల్డర్ అరెస్టు

పెనమలూరు, జనవరి 8 : వణుకూరు పేదల కాలనీలో ఇళ్లు నిర్మిస్తామని లబ్ధిదారుల నుంచి సొమ్ము తీసుకుని నిర్మించకుండా మోసం చేసిన కేసులో నిందితుడు కనజం వీరకృష్ణను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. 60 మందికి పైగా బాధితుల నుంచి షుమారు రూ. 35 లక్షలకు పైగా వసూలు చేసి మోసం చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని సీఐ టీవీవీ రామారావు తెలిపారు. దర్యాప్తు అధికారి యేసేబు మాట్లాడుతూ, నిందితుడికి నాలుగు బ్యాంకు ఖాతాలున్నాయని, వాటిని ఫ్రీజ్ చేసి లావాదేవీలను పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుని లబ్ధిదారులకు న్యాయం జరిగేట్లు చూస్తామని తెలిపారు. ఈ కేసులో సచివాలయ ఉద్యోగుల ప్రమేయంపై దర్యాప్తు జరుగుతోందని, ఆరోపణలు వచ్చిన వారిని విచారించి వారి ప్రమేయం ఉన్నట్లు తేలితే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

హనుమాన్‌జంక్షన్, జనవరి 8: మహిళను వేధించిన వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుగొలను వద్ద ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్న పెదపారుపూడి మండలం మోపర్రుకు చెందిన మహిళ పట్ల అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ అసభ్యకరంగా ప్రవర్తించి వేధించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

ఉయ్యూరు, జనవరి 8 : గండిగుంట పంచాయతీ పరిధి ఆనందపురం ఎస్సీ కాలనీని ఆనుకుని ఉన్న జనవరుల శాఖకు చెందిన భూమిని ఆక్రమించి కొందరు రైతులు క్రయ విక్రయాలు జరుపుతున్న నేపథ్యంలో విలువైన భూమిని పరిరక్షించాలని కోరుతూ లాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, ఉయ్యూరు ఆర్డీవో, తహసీల్దార్‌కు సోమవారం ఫిర్యాదు చేసినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ తెలిపారు. ఆనందపురానికి చెందిన కంభం రమేశ్, బేతపూడి జోగేశ్వరరావు, పార్వతి ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

కబ్జా భూమిని పేదలకు పంచాలి

విజయవాడ రూరల్, జనవరి 8 : పాతపాడులో కబ్జాదారుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని ఎమ్మార్పీఎస్ నేతలు సోమవారం కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. పాతపాడులోని జానకమ్మకుంట ప్రాంతంలో సర్వే నెంబరు 1/5లో 70 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ప్రస్తుతం ఆ భూమి పంతులుగారు అనే వ్యక్తి ఆక్రమణలో ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆ భూమిని కబ్జాదారుల కబంధ హస్తాల్లోంచి విడిపించి నిరుపేదలైన షెడ్యూల్ తెగలు, కులాల వారికి పంచాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి పేటేటి కిషోర్, కోతాడి రమణ కుమారి ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉంగుటూరు, జనవరి 8 : ప్రభుత్వ వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ. ఇటీవల ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డ మానికొండ గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి రత్నాకర్ పెద్దకర్మ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మద్యం షాపుల సిబ్బంది కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. మృతుడి కుటుంబానికి చేయూతనందించేందుకు చేయిచేయి కలిపి సేకరించిన రూ.40వేలు నగదును రత్నాకర్ తల్లిదండ్రులకు అందజేశారు.



రత్నాకర్ తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేస్తున్న తోటి సిబ్బంది

బ్యానర్ల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు



ఎస్సై జనార్దన్‌కు ఫిర్యాదు చేస్తున్న కొత్తపల్లి టీడీపీ, జనసేన నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 8 : కొత్తపల్లిలో టీడీపీ, జనసేన బ్యానర్లను ధ్వంసం చేయడం కొనసాగుతుండటంతో అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన నాయకులు సోమవారం ఎస్సైకు ఫిర్యాదు చేశారు. కొత్తపల్లిలో ఆదివారం అల్లరిమూకలు బ్యానర్లను ధ్వంసం చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసులు వెళ్లినా కూడా సోమవారం తెల్లవారుఝామున కొందరు యువకులు మిగిలిన బ్యానర్లను మళ్లీ ధ్వంసం చేయడంతో గ్రామంలోని టీడీపీ, జనసేన శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమౌతున్నాయి. అల్లరిమూకలు కావాలనే గ్రామంలో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ఇలాంటి దుందుడుకు చర్యలు చేస్తున్నారని టీడీపీ, జనసేన నాయకులు విమర్శిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వల్లూరిపల్లి నాని, అక్కినేని రవికుమార్, కోరం సుధీర్, పొట్లూరి సుధాకర్, గోకుల్, రామిశెట్టి వరప్రసాద్, తమ్మినేని రాజు, తదితరులు పాల్గొన్నారు. ● ఫిర్యాదు సమయంలో ఎస్సై జనార్ధన్ సరిగా స్పందించకపోగా, బ్యానర్లకు సీసీ కెమెరాలు పెట్టుకోవాలని సూచించడంతో టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎస్‌సీతో విజయ ఫార్మసీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత

ఎనికేపాడు(గన్నవరం), జనవరి 8 : ఎనికేపాడు ఎస్ఆర్‌కె ఫౌండేషన్ విజయ ఫార్మసీ కళాశాల, విశాఖపట్నం సీఎస్‌సీ అకాడమి పరస్పర ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పంద పత్రాలను సోమవారం మార్చుకున్నారు. సీఎస్‌సీ అకాడమి సలహాదారు వై.రామ్మోహనరావుతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మ లత ఒప్పందం చేసుకున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతర్జాల విష యాలు, సాంకేతికత మీద కోర్సేరా, ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటుగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు త్రిడి ప్రింటింగ్, జీవశాస్త్ర అనుసంధానం, ప్రాథమిక ఆంగ్లభాష విషయాలపై వాధ్వాని ఫౌండేషన్ ద్వారా ఉపాధి నైపుణ్యాలను, పారిశ్రామిక వ్యవస్థాపక శిక్షణ అందిస్తామని తెలిపారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫాదర్ ప్రవీణ్‌కు అభినందన

ఉంగుటూరు, జనవరి 8 : బ్రదర్ జోసఫ్ తంబి పునీత పట్టా సాధనలో భాగంగా సోమవారం 18వ గురుపట్టాభిషేక వార్షికోత్సవం జరుపుకున్న రెవ.ఫాదర్ గోపు ప్రవీణ్‌కు తోటి గురువులు, ఉపదేశులు, కన్యాస్త్రీలు అభినందనలు తెలిపారు. గురువుగా విశ్వాసులకు, భక్తులకు తన అమూల్యమైన సేవలు అందించినందుకు ఆయనను తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్, విచారణ గురువులు ఫాదర్ అభిలాష్ గోపు, ఇతర గురువులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.

అంగన్వాడీలపై ఎస్మా సిగ్గుచేటు

సాగునీటి సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ



గన్నవరంలో అంగన్వాడీల దీక్షకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకులు

గన్నవరం, జనవరి 8 : అంగన్వాడీలను నమ్మించి నిలువునా మోసం చేసిన జగన్ వారిపై ఎస్మా ప్రయోగించటం దారుణమని, రానున్న ఎన్నికల్లో వారి సత్తా చూస్తారని సాగునీటి వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేస్తున్న అంగన్వాడీలకు టీడీపీ రైతు సంఘాల నేతల మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్ల మాట్లాడుతూ, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు రూ.10,500కు వేతనం పెంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగించారని, జగన్‌రెడ్డి రూ.వెయ్యి పెంచి సంక్షేమ పథకాలన్నీ తొలగించటం దుర్మార్గమన్నారు. గుండపనేని ఉమావర ప్రసాద్, ఎస్ రమాదేవి, వేగిరెడ్డి పాపారావు, కలపాల రాధాకృష్ణ, మజ్జిగ నాగరాజు, కొండపల్లి వెంకన్న, రాజేశ్వరరావు, చిలకపాటి శ్రీనివాసరావు, యనమదల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



ఉయ్యూరులో విద్యుత్ మీటర్ల తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఉయ్యూరు, జనవరి 8 : విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారుల బృందం సోమవారం ఉయ్యూరులో 2,079 గృహ వినియోగ సర్వీసులు, 145 వాణిజ్య సర్వీసులు తనిఖీ చేసి అదనపు లోడు వాడుతున్న 145 సర్వీసు లకు రూ.4,28,000 అపరాధ రుసుం విధించారు. ఉయ్యూరు డీఏఈ కృష్ణనాయక్, విజిలెన్స్ ఏఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 35 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. డీఈఈ రామకృష్ణ, ఏఈ నాగమల్లేశ్వరరావు, డీఈఈలు, ఏఈలు ఏజీలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీల్లో పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం అగ్రస్థానం

టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జనవరి 8 : రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రరాష్ట్రం అగ్రస్థానంలో ఉందని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యలను పట్టించుకునే నాథుడే లేడని రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని, కౌలు రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మన రాష్ట్రం రెండవ స్థానంలో ఉండగా రైతు ఆత్మహత్యల్లో మూడవ స్థానంలో నిలవటం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో అస్తవ్యస్త పాలన కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమని, తడిచిన ధాన్యం కొనే దిక్కులేకుండా పోయిందని తక్షణం రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం కొనాలని యార్లగడ్డ డిమాండ్ చేశారు

సృజనాత్మకతను వెలికితీసేందుకే పోటీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 8 : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ పోటీతత్వాన్ని పెంపొందించేందుకు పోటీలు అవసరమని ఎంపీపీ యరగొర్ల నగేష్ అన్నారు. కానుమోలు హైస్కూల్‌లో కళ్లేపల్లి నారాయణరావు, లక్ష్మీ దంపతులు ఆధ్వర్యంలో హెచ్‌ఎం పద్మజ పర్యవేక్షణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాలను పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో పాటు పాల్గొన్న అందరికీ కన్సొలేషన్ బహుమతులను జెడ్పీటీసీ గంగాభవాని అందజేశారు.

● హనుమాన్‌జంక్షన్ : మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10న స్థానిక కాకాని కల్యాణ మండపంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధ్యక్ష కార్యదర్శులు కూరెళ్ల సుబాచారి. కళ్లేపల్లి నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీ పాలనలో అందరికీ సంక్షేమ పథకాలు



యార్లగడ్డ సంక్రాంతి కానుకలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

గన్నవరం, జనవరి 8 : టీడీపీ పాలనలోనే అందరికీ సంక్షేమ పథకాలతో పాటు పండగలకు కానుకలను అందజేశారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో సోమవారం సంక్రాంతి కానుకగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు పంపిన చీరలను టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కొమ్మరాజు సుధీర్, మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, కాసన్నేని రంగబాబు, జాస్తి ఫణిశేఖర్, తుల్లిమిల్లి ఝాన్సీలక్ష్మీ, బుస్సే సరితాదేవి, చిమట శ్రీనివాసరావు, నాగబాబు, నర్రా లక్ష్మణరావు, బుస్సే నాగ ప్రసాద్, మోదుగుమూడి రాజేశ్వరి, అరిఫ్‌ఖాన్, ఆసిఫ్‌ఖాన్, ఆళ్ల శ్రీనివాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : గన్నవరం టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు మహిళలకు అందించిన సంక్రాంతి కానులను సోమవారం బాపులపాడులో టీడీపీ నేతలు పంపిణీ చేశారు. టీడీపీ హనుమాన్ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐటీఐ, వేలేరు రోడ్డులో ఇంటింటికి వెళ్లి చీరలు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు, వీరమాచనేని బుజ్జి, ఆళ్ల సురేష్, ఫణి పాల్గొన్నారు.

సంప్రదాయాలను తెలిపేందుకే సంక్రాంతి సంబరాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 8 : మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజెప్పేందుకు సంక్రాంతి సంబరాలు ఉపయోగకరమని సర్పంచ్ భారతి, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని అన్నారు. రేమల్లె హైస్కూల్‌లో హెచ్‌ఎం లూథర్‌పాల్ పర్యవేక్షణలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు యనమదల సాంబశివరావు, వెలగపూడి మధుసూదనరావు, సుధాకరరావు బహుమతులను అందజేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	85, 92, 102
చికెన్ విత్ స్కిన్	164
చికెన్ స్కిన్‌లెస్	174

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.65



చౌటపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.7లక్షల సీజ్

గుడివాడ రూరల్ : ఏలూరు - కృష్ణాజిల్లా సరిహద్దు చౌటపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ సందర్భంగా ఎటువంటి ఆధారాలు చూపని రూ.7 లక్షల నగదు గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై ఎన్.లక్ష్మీనరసింహమూర్తి తెలిపారు. ముదినేపల్లి నుంచి కారులో నగదు తీసుకొస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు నగదు తీసుకెళ్లేటప్పుడు కచ్చితంగా దానికి సంబంధించిన పత్రాలు, రశీదులు కలిగి ఉండాలన్నారు.

ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ అందించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

మోపిదేవి : ప్రభుత్వం నిబంధనలు సడలించి ఆక్వా సాగు చేసే రైతులకు విద్యుత్ సబ్సిడీ అందజేయాలని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్సిడీ పునరుద్ధరించాలని కోరుతూ మోపిదేవి ప్రధాన కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం పెదకళ్లేపల్లి గ్రామానికి చెందిన ఆక్వా రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పెదకళ్లేపల్లి గ్రామంలో 150 మంది రైతులు ఆక్వా సాగు చేస్తుండగా, 60 మందికి సబ్సిడీ ఇవ్వకపోవటంలో అంతర్యమేమిటో చెప్పాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నవీన్‌కుమార్‌కు అందజేశారు. జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని న్యాయవాదుల నిరసన



మచిలీపట్నం టౌన్ : ప్రజల హక్కులను కాలరాసే ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలంటూ సోమవారం జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు వినూత్న రీతిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు, ప్రధాన కార్యదర్శి కొట్టె రఘురామ్, ఉపాధ్యక్షుడు మట్టా వెంకట సుబ్బారావు, సీనియర్ న్యాయవాదులు డి. పోతురాజు,నరసింహారావు, బూరగడ్డ అశోక్, న్యాయవాద గుమాస్తాల సంఘం నాయకుడు పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.

వలంటీర్‌ను విధుల నుంచి తొలగించాలి : టీడీపీ

మోపిదేవి : చైతన్య నగర్ వద్ద నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న వ్యక్తులపై దాడికి పాల్పడిన గ్రామ వలంటీర్ కొక్కిలిగడ్డ సుధాకర్‌ను విధుల నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని కోరుతూ టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. వెంటనే నిందితులను అదుపులోకి తీసుకుని గ్రామవలంటీర్‌ను విధుల నుంచి తొలగించాల్సిందిగా డిమాండ్ చేశారు. ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కర్రా సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు : రాష్ట్ర స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీల్లో గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎస్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు చాంపియన్ షిప్ సాధించి విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ తెలిపారు. విజేతలను, శిక్షణ ఇచ్చిన పీడీ వి.శ్రీనివాసరావు, సహాయ పీడీ ఎం.భవదీప్, మెకానికల్ ఇన్‌స్ట్రక్టర్ కె.పిచ్చయ్య, ప్రత్యేక సహకారం అందించిన ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.శివశంకర్, డి.పూజితలను ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎన్.ఎస్.ఎస్.వి రామాంజనేయులు, యాజమాన్యం అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పమిడిముక్కల విద్యార్థులు



ఉయ్యూరు : తిరుపతిలో జరిగే 14వ జూనియర్ రాష్ట్రస్థాయి స్థాయి హాకీ పోటీలకు పమిడిముక్కల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో జరిగే పోటీలకు బొల్లా శివ సతీశ్‌బాబు, తలశిల రాంచరణ్, కాసాని ఆకాశ్, గుర్రం వీరబాబు, దేవానబోయిన తరుణ్, పోతబోయిన జస్వంత్, మల్లెల సాయి మనోహర్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వక్కలగడ్డ కేశవనారాయణ తెలిపారు. కోచ్ ఈవీ నారాయణ, క్రీడాకారులను ఎస్ఎంసీ సెక్రటరీ కనపర్తి దుర్గా భవాని, స్టాఫ్ సెక్రటరీ అరుణ, సమత, శ్రీకుమార్, రామకృష్ణ అభినందించారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో కనకదుర్గకు బంగారు పతకాలు



మచిలీపట్నం టౌన్ : విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో బచ్చుపేటకు చెందిన కనకదుర్గ 100 మీటర్ల పరుగుపందెం, జావెలిన్ త్రో, 100 మీటర్ల హర్డిల్స్‌లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. మూడు విభాగాల్లో మొదటి స్థానంలో విజేతగా నిలిచిన కనకదుర్గ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అరుణ భర్త సత్తార్ ఆర్‌పేట పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భర్త ప్రోత్సాహంతో తాను క్రీడాకారిణిగా రాణిస్తున్నట్టు తెలిపారు. అరుణను పలువురు క్రీడాకారులు అభినందించారు.

గుడ్లవల్లేరు ఫార్మశీ విద్యార్థి ప్రతిభ



గుడ్లవల్లేరు : వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల బీఫార్మశీ విద్యార్థిని రైజా మెహ జబీన్‌కు జాతీయ స్థాయి పోస్టర్ ప్రదర్శనలో ప్రథమస్థానం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. అధిక రక్త పీడనానికి విని యోగించే ఔషధాల మోతాదులపై చేసిన పోస్టర్‌కు ప్రథమ బహుమతి సాధించిదని లక్ష్మణరావు తెలిపారు. మెహ జబీన్‌ను అధ్యాపకులు ఎస్.కె అమీనాబీ, వి.రవీష, టి.ప్రశాంతి, బి.మోహన్ గాంధీ, టి.బాలకృష్ణ, బి.సత్యశ్రీ తదితరులు అభినందించారు.

పైడమ్మ జాతర ఆదాయం రూ.10.24 లక్షలు

పెడన : పైడమ్మ ఆలయానికి జాతర సందర్భంగా రూ.10 లక్షల 24 వేల 773 ఆదాయం లభించింది. ఉత్సవాలలో ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలను సోమవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ. 4,01,671, పది రూపాయల దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ. 1,90,400, రూ.25 దర్శనం టికెట్ల ద్వారా రూ. 1,28,775, విరాళాల ద్వారా రూ.3,03,907ల ఆదాయం లభించింది. ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు పర్యవేక్షణలో జరిగిన లెక్కింపు కార్యక్రమంలో ఆశాది దాసు లీలాప్రకాష్, పాలక మండలి సభ్యులు తోట సాంబశివరావు, శ్రీకాకుళపు సుబ్బారావు, చాకరజాముల భగవాన్, చిల్లిముంత శ్రీనివాసరావు, సిరివెళ్ల వెంకట సూర్యనారాయణ, కౌన్సిలర్ పద్మావతి పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

గుడివాడ రూరల్ : అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రజలకు సేవలందించాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడుతూ, శాఖల వారీగా సమీక్ష చేశారు. విరిగిన విదుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యలు చెబితే పట్టించుకోవాలన్నారు. తాగునీరు ఎప్పుడు వదులుతున్నదీ స్పష్టంగా గ్రామసర్పంచ్‌లకు తెలియజేయాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ మాట్లాడుతూ నిధులు మంజూరయ్యాయని, గ్రామాల వారీగా పనులను చేయాలని కోరారు. గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ మట్టా నాగమణి, ఎంపీడీవో వెంకటరమణ, పాల్గొన్నారు.

చెరకు రైతులకు కుమార్‌రాజా ఆర్థిక సాయం

తోట్లవల్లూరు : ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసు కోవాలని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా డిమాండ్ చేశారు. యాకమూరులో ఆదివారం రాత్రి బెజవాడ శివమూర్తి, శీలం రామకృష్ణ, వల్లూరు సుబ్బారావుకి చెందిన తొమ్మిది ఎకరాల చెరకు తోటలు దగ్ధమయ్యాయి. ముగ్గురు రైతులకు సోమవారం టీడీపీ తరఫున రూ. 35 వేల ఆర్థిక సహాయాన్ని కుమార్ రాజా అందించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు చొప్పరపు సుబ్రహ్మణ్యం, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎస్ కృష్ణసుమన్, మాజీ ఎంపీటీసీ బొమ్మారెడ్డి కోటిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి వీరంకి వరహాలరావు, గోళ్ళ శివ తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీలకు సంఘీభావం తెలుపుతున్న గోపు సత్యనారాయణ



బంటుమిల్లిలో అంగన్వాడీలకు సంఘీభావం తెలుపుతున్న వేదవ్యాస్



అవనిగడ్డలో సంఘీభావం తెలుపుతున్న జనసేన నేతలు

ఎస్మా ప్రయోగం దుర్మార్గపు చర్య

అంగన్వాడీల పోరుకు టీడీపీ నేతలు వేదవ్యాస్, గోపు సత్యనారాయణ సంఘీభావం

మచిలీపట్నం టౌన్, జనవరి 8 : అంగన్వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. మచిలీపట్నం ధర్నా చౌక్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు 28 రోజులుగా నిర్వహిస్తున్న రిలేదీక్షా శిబిరాన్ని సోమవారం వారు సందర్శించి సంఘీభావం తెలిపారు. టీడీపీ నాయకులు గోపు సత్యనారాయణ, టీడీపీ నాయకుడు రూ.15 వేల విరాళాన్ని అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తల సమ్మె సోమవారానికి 28 వరోజుకు చేరుకుంది. శిబిరాన్ని రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, లంకే శేషగిరి, తెలుగు మహిళ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి లంకిశెట్టి నీరజ, ,కార్పొరేటర్ మరకాని సమతాకీర్తి, నగర పార్టీ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, కొరెడ్ల సుశీల , గోకుల్ శివ, బత్తిన దాసు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వై నరసింహారావు, సీపీఎం నాయకులు సుబ్రహ్మణ్యం , సీపీఐ నాయకులు లింగం ఫిలిప్ , కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, అబ్దుల్ మతీన్ తదితరులు సంఘీభావం తెలిపారు.



బంటుమిల్లిలో ఉరితాడుతో నిరసన

బంటుమిల్లి : అంగన్‌వాడీ సమ్మెను నిషేదిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్.2ను తక్షణమే ఉపసంహరించుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ డిమాండ్ చేశారు. బంటుమిల్లిలో అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. మెడకు ఉరి బిగించుకుని అంగన్వాడీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వేదవ్యాస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ అహంకారానికి అంగన్వాడీల ఆత్మగౌరవానికి మధ్య జరిగే ఉద్యమంలో అంతిమ విజ యం అంగన్వాడీలదే అన్నారు. అనంతరం రూ.10 వేలు ఆర్థిక సహాయం చేసి పండ్లు పంపిణీ చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం



కూచిపూడి : అంగన్వాడీలు ఆందోళన తీవ్రతరం చేశారు. మొవ్వ ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో గత 28 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరవధిక సమ్మె చేపట్టారు. ఎస్మా చట్టం ప్రయోగిం చినప్పటికీ అదిరేది...బెదిరేది లేదంటూ తేల్చి చెప్పారు. మొవ్వలో సోమవారం మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాల కార్యకర్తలు, సహాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు.

జనసేన సంఘీభావం

అవనిగడ్డ : అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిస్తే ప్రత్యక్ష కార్యాచరణ ప్రకటిస్తామని జనసేన నేతలు హెచ్చరించారు. అవనిగడ్డ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని సోమవారం వారు సందర్శించి మద్దతు తెలిపారు. తక్షణమే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించి విధుల్లోకి చేర్చుకోవాలని కోరారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, మాదివాడ వెంకట కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, రాజనాల వీరబాబు, బచ్చు వెంకట నారాయణ, అన్నపరెడ్డి ఏసు, తోట ఆంజనేయులు, సనకా గోపాలరావు, అడపా ప్రభాకర్, కమ్మిలి సాయిభార్గవ, పప్పుశెట్టి శ్రీను పాల్గొన్నారు.



చినలింగాలలో పర్యటిస్తున్న వెనిగండ్ల, రావి, పిన్నమనేని



అవనిగడ్డలో కరపత్రాలు అందజేస్తున్న మండలి వెంకట్రామ్



టీడీపీలో చేరిన వారితో కాగిత కృష్ణప్రసాద్

టీడీపీ పాలన కోసం ప్రజల ఎదురుచూపులు : వెనిగండ్ల

నందివాడ, జనవరి 8 : వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారని, కనీస మౌలిక వసతులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని టీడీపీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని చినలింగాల గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. వెనిగండ్ల రామును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గ్రామపార్టీ అధ్యక్షుడు సర్పంచ్ దాసం చిన్న రాంబాబు, మాజీ ఎంపీపీ కొలకలేటి భవాని ప్రసాద్, కొలకలేటి వెంకట సతీష్, ఆత్కూరి వెంకట రమణ, మాజీ ఎంపీపీ చాట్రగడ్డ రవి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామశాస్త్రి, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాకరాల సురేష్, క్లస్టర్ తాతినేని మురళీ, మద్దాలి ఇస్సాక్, కొల్లి రమ్య, యార్లగడ్డ రవి, కొల్లి పెద బాబు, రామపూడి సాల్మన్ రాజు, కె.సతీష్, రమణ, శ్రీను, తుమ్మలపల్లి సర్పంచ్ సింగాల రాధాకృష్ణ, ఏసుపాదం, కొల్లి సుధాకర్ పాల్గొన్నారు. **అవనిగడ్డ :** వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు వరకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ పిలుపునిచ్చారు. అవనిగడ్డ రెండో వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. **అవనిగడ్డ రూరల్ :** బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం పులిగడ్డలో సోమవారం జరిగింది. బూత్ నెంబర్ 134లోని గృహాలను సందర్శించి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసినట్లు ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి గుంటూరు వినయ్ బాబు తెలిపారు. నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **పామర్రు :** రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి కాపాడాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యాక్రమం నిర్వహించారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాలను వివరించే కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. మంతెన రామాంజనేయులు, దాలిపర్తి ప్రసాద్, పరిసే సుబ్రమణ్యం, రాజు, కేదరాశిపల్లి శ్రీనివాసరావు, అల్లంశెట్టి సురేష్ అంజిబాబు, సందిప్, చాట్ల చినరమేష్ తదితరులు పాల్గొన్నారు. **పమిడిముక్కల :** ప్రజల అభ్యున్నతి, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వర్లకుమార్ రాజా అన్నారు. పమిడిముక్కల పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించిన జగన్మోహన్‌రెడ్డి అరాచకం యువత జీవితాలను చిత్తు చేయడం వరకు వచ్చిందని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చెందిన 130 పథకాలు కనుమరుగు చేశారని దుయ్యబట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లూరు బాబ్జి, జక్కా శ్రీనివాసరావు, అబ్బాస్ అలీ, నాదెళ్ల సుబ్రమణ్యం, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాగిత సమక్షంలో 50 మంది టీడీపీలో చేరిక

పెడన రూరల్ : పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాధరావు(బుల్లయ్య)తో కలసి ఉప్పలకలవగుంట గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన గాజుల నాగవేణుబాబు, భార్గవ్, సత్యన్నారాయణ, గుడిశేవ సాయి, పోతన నాని, భూపతి శ్రీనివాసరావు, నల్లమోతు నాగమల్లి తదితరులు 50 మంది టీడీపీలో చేరారు. పార్టీ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు అద్దాలు పగలకొట్టిన నిందితుల అరెస్టు

చల్లపల్లి, జనవరి 8 : బస్సు అద్దాలు పగలకొట్టి, దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడి, వీరంగం సృష్టించిన నిందితులను చల్లపల్లి ఎస్సై సిహెచ్.చిన్నబాబు అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ వారికి రిమాండ్ విధించారు. ఆదివారం రాత్రి మచిలీపట్నం నుంచి అవనిగడ్డ వెళుతున్న ఆర్టీసీ బస్సు అద్దాలను పగలకొట్టిన యువకులు ఆర్టీసీ వారితో గొడవపడ్డారు. చల్లపల్లిలోని ఎడ్ల వారి వీధికి చెందిన ఈడే మాధవరావు, జంపాన సుధాకర్ అనే ఇద్దరు యువకులు పార్కింగ్ విషయమై బస్సు డ్రైవర్‌తో గొడవపడి చేతులతో కొట్టి, అడ్డువచ్చిన మహిళా కండక్టర్‌ను బూతులు తిట్టి అద్దం పగలకొట్టడంతోపాటు రోడ్డుపై వీరంగం సృష్టించారు. కండక్టర్ గొరుముచ్చు నీలిమ ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించి, విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై చల్లపల్లి ఎస్సై చిన్నబాబు కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి సోమవారం మొవ్వ కోర్టులో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

దాడి ఘటనలో ముగ్గురికి రిమాండ్

తోట్లవల్లూరు : కత్తితో దాడి చేసిన ఘటనలో పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి సోమవారం కోర్టుకు హాజరు పర్చారు. నిందితులు అనిల్‌కుమార్, గుమ్మడి నాగేశ్వరరావు, రామయ్యలకు జడ్జి 14 రోజులు రిమాండ్ విధించగా గన్నవరం జైలుకు తరలించినట్లు ఎస్సై పి విశ్వనాద్ తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా సుధాకర్‌పై కత్తితో దాడి జరిపిన విషయం తెలిసిందే.

పులిగడ్డలో చెక్ పోస్టు ఏర్పాటు

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ టోల్‌ప్లాజా సమీపంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రలోభాలకు గురి చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండటానికి ఈ చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారుల సేవాభావం



చల్లపల్లి : తల్లి పుట్టినరోజున చిన్నారులు సేవా కార్యక్రమం నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. వేకనూరుకు చెందిన మాదివాడ రాము దంపతుల కుమారులు యోజిత్, తేజిత్ చల్లపల్లి సీయో ను వృద్ధాశ్రమంలో అనాధ వృద్ధులకు నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలను ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావుకు అందించారు. తల్లి పద్మావతి పుట్టినరోజు కావటంతో దాచుకున్న డబ్బులతో చల్లపల్లి తోపాటు పలు చోట్ల సేవా కార్యక్రమాలు చేశారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం

మచిలీపట్నం టౌన్ : బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తీసుకుని వస్తామని బ్రాహ్మణ సంఘం నేతలు గన్నవరపు శ్రీనివాస్(నరసాపురం), బి.వి.రమణమూర్తి(రాజమండ్రి) బి.ఎస్.ఆర్. శర్మ (అమలాపురం) తెలిపారు. బ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా కన్వీనర్‌గా నియమితులైన పి.వి.ఫణికుమార్‌ను సోమవారం వారు అభినందించి సత్కరించారు. వేమూరి రామకృష్ణారావు, మూర్తి, మోపర్తి సుబ్రహ్మణ్యం, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు జనసేన సంఘీభావం

మచిలీపట్నం టౌన్ : మహిళల ఉసురు తగిలిన నాయకులెవరూ పదవిలో ఎక్కువ కాలం నిలవలేదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. ధర్నా చౌక్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరాహార దీక్షా శిబిరాన్ని బండి రామకృష్ణ సందర్శించి సంఘీభావం తెలిపారు.

అంగన్వాడీలకు అఖిలపక్షం సంఘీభావం

బంటుమిల్లి : అంగన్వాడీల సమ్మెకు అఖిలపక్ష నాయకులు సంఘీభావం తెలిపారు. గుండాబత్తుల ఆంజనేయులు స్మారక భవనంలో నిర్వహించిన సమావేశంలో అంగన్వాడీలపై కక్ష సాధింపు చర్యలను ముక్తకంఠంతో ఖండించారు. కూనపరెడ్డి వీరబాబు, పుప్పాల సూర్యనారాయణ, గౌరిశెట్టి నాగేశ్వరరావు, అజయ్ ఘోష్ , మాజేటి శివశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



గుడ్లవల్లేరు : నెహ్రూపశువుల సంత, పెరుమాళ్ళ, వల్లభనేని రామకృష్ణ(యు.ఎస్.ఏ), గుత్తికొండ సుభాష్‌చంద్రబోస్ అందజేసిన ఆరు కుట్టుమిషన్లను జిల్లా లయన్స్ గవర్నర్ జి.ఎన్ శంకరగుప్తా మహిళలకు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు బొర్రా నాగేశ్వరరావు, చలసాని శ్రీధర్,పెరుమాళ్ళ చక్రధర్, కొల్లి రామకృష్ణప్రసాద్, దుత్తా శ్రీనివాస్, ప్రసాద్, కొసరాజు బాపయ్య చౌదరి, పొట్లూరి రవికుమార్, వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, పోలవరపు వెంకట్రావు, విజయ్‌బాబు పాల్గొన్నారు.

రహదారి పనులకు ఎంపీపీ శంకుస్థాపన

పెదపారుపూడి : దోసపాడు శివారు తమలంపాడు నుంచి మూడు కిలోమీటర్లు మేర ఆర్ అండ్ బి రహదారి మరమ్మత్తు పనులకు సోమవారం ఎంపీపీ గోగం సురేష్ శంకుస్థాపన చేశారు. పంచాయతీ కార్యదర్శి సాగర రాణి, గ్రామస్థులు పాల్గొన్నారు.